సాక్షి
పార్వతీపురం మన్యం
గురువారం । 18 । జనవరి । 2024



సామాజిక సాధికారతకు... అంబేడ్కర్ విగ్రహమే సాక్ష్యం
'డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 206 అడుగుల భారీ విగ్రహం సామాజిక సాధికారతకు నిలువెత్తు నిదర్శనం కానుంది. - 10లో



పోలమాంబ ఆలయానికి భక్తుల తాకిడి - 10లో
ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.



చెక్‌పోస్టు వద్ద నిరంతర నిఘా
త్వరలో సార్వత్రిక ఎన్నికలు ఉన్నందున పోలీస్ చెక్ పోస్టుల వద్ద నిరంతర నిఘా, పటిష్ట భద్రత చర్యలు తీసుకుంటున్నట్లు డీఎస్పీ శ్రీధర్ తెలిపారు. - 10లో

న్యూస్‌రీల్

867 మందికి వైద్య సేవలు

పార్వతీపురంటౌన్: జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష-2 వైద్యశిబిరాల్లో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్టు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు తెలిపారు. జిల్లాలో బుధవారం నిర్వహించిన మూడు శిబిరాల్లో 867 మందికి వైద్యసేవలు అందించామన్నారు.

బుధవారం అందించిన వైద్యసేవలు	
మండలాలు	15
వైద్యశిబిరాలు	3
మొత్తం ఓపీలు	867
స్పెషలిస్టుల ఓపీలు	422
పీహెచ్‌సీ సిబ్బంది నిర్వహించిన ఓపీలు	445
డీఎం	312
హెచ్‌టీఎన్	433
ఏఎన్‌సీ	11
పీఎన్‌సీ	17
అనీమియా	24
ల్యాబ్‌టెస్టులు	701
ఈసీజీ పరీక్షలు	0
కంటి పరీక్షలు	63
రిఫరల్ కేసులు	1

22న ఓటరు తుది జాబితా విడుదల



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: ఓటరు తుది జాబితాను ఈ నెల 22న విడుదల చేస్తామని కలెక్టర్ నిషాంత్‌కుమార్ తెలిపారు. కలెక్టర్ కార్యాలయ చాంబర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నామినేషన్ల చివరి తేదీ వరకు ఓటర్ల నమోదు దరఖాస్తులు స్వీకరిస్తామని, వారి పేర్లను సప్లిమెంటరీ జాబితాలో విడుదల చేస్తామని చెప్పారు. ఓటరు జాబితాలో పేరు, అడ్రస్ మార్పు, ఒకే డోర్ నంబర్ తదితర సమారు 95వేల సవరణలు చేసి సరిదిద్దినట్టు తెలిపారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై ఓటు వేసే విధానంపై జిల్లా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు మాట్లాడుతూ జనవరి 1, 2024 నాటికి ప్రతిపాదిత ఓటరు జాబితా ప్రకారం జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో మొత్తం ఓటర్లు 7,70,525 మంది కాగా వారిలో 3,76,220 మంది పురుషులు, 3,94,240 మంది మహిళలు, 65 మంది ట్రాన్స్ జెండర్లు ఉన్నారన్నారు. జిల్లాలో ఇప్పటివరకు మొత్తం 1,86,354 ఫారాలు స్వీకరించగా, వాటిలో 1,79,811 ఫారాలు పరిష్కరించి ఓటరుజాబితాలో చేర్చామని తెలిపారు. 1262 ఆమోదం చేయడం జరిగిందని, 4991 తిరస్కరణకుగురయ్యాయని, 290 పరిష్కరించాల్సి ఉందన్నారు. సమావేశంలో వివిధ పార్టీల నాయకులు పి.అప్పారావు, జి. వెంకటనాయుడు, రెడ్డి వేణు, టి.వెంకటరమణ, సీహెచ్.సంతోష్ కుమార్, ఎస్.ఉమామహేశ్వరరావు పాల్గొని జిల్లాలో చేపట్టిన ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై సంతృప్తి వ్యక్తంచేశారు. రాష్ట్రంలోనే ఎటువంటి ఫిర్యాదులు రాని జిల్లాగా పార్వతీపురం మన్యం జిల్లా ఉందని, స్వచ్ఛమైన ఓటరు జాబితా తయారీలో కృషిచేసిన కలెక్టర్, జిల్లా యంత్రాగానికి కృతజ్ఞతలు తెలిపారు.

టీడీపీలో డబ్బునోళ్లకే సీట్లు!

అవసరానికి వాడుకోవడం.. అవసరం తీరాక మోహంచాటేయడం.. ఎదురుతిరిగిన వారికి వెన్నుపోటు పొడవడం వంటివి చంద్రబాబుకు వెన్నతోపెట్టిన విద్య!. ఓటర్లు, నాయకులు, సొంత బంధువులపైనా ఆయనది అదే ధోరణి!. ఎన్నికలు సమీపిస్తున్న వేళ అధికార దాహంతో రగిలిపోతున్నారు. దీనికోసం పార్టీకి దశాబ్దాల తరబడి సేవలందించిన సీనియర్ నాయకులను కాదని డబ్బునోళ్లకే సీట్లు కేటాయించేందుకు రెడీ అవుతుండడంతో ఆ పార్టీ వర్గాల్లో కలకలం రేగుతోంది. చంద్రబాబు వ్యవహరిస్తున్న తీరును కొన్ని వర్గాలవారు బహిరంగంగానే విమర్శిస్తుండగా, మరికొందరు పార్టీని వీడేందుకు సన్నద్ధమవుతున్నారు.





- సార్వత్రిక ఎన్నికల కోసం టీడీపీ-జనసేన ఫీట్లు
- సీనియర్ టీడీపీ నాయకులకు చంద్రబాబు ఝలక్
- ఎన్‌ఆర్‌ఐలవైపే మొగ్గు...
- ధనబలం ఉన్నవారికే ప్రాధాన్యం ఇవ్వడంపై రగులుతున్న అసంతృప్తి
- పార్టీని వీడే యోచనలో పలువురు నాయకులు!

సాక్షి ప్రతినిధి, విజయనగరం: వారంతా ఇప్పుడే రాజకీయాల్లోకి వచ్చిన వారు కాదు... సుదీర్ఘ కాలంగా తెలుగుదేశం పార్టీలో విశేషమైన సేవలు అందించినవారు... అందులోనూ ఉమ్మడి విజయనగరం జిల్లాలో ప్రధాన సామాజిక వర్గానికి చెందిన నాయకులు కూడా! టీడీపీ అధికారంలో ఉన్నా లేకపోయినా సరే ఆ పార్టీను, అధినేత చంద్రబాబును నమ్ముకునే ఇన్నాళ్లూ ఉన్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ ఘోర వైఫల్యం చెందినప్పటికీ రాష్ట్రవ్యాప్తంగా ఆ పార్టీ అధినేత చంద్రబాబును ప్రజలు ఛీదరించుకున్నప్పటికీ ఆయన వెన్నంటే ఉంటూ నియోజకవర్గంలో టీడీపీ కార్యక్రమాలు నిర్వహించుకుంటూ వచ్చారు. తీరా 2014 ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఎన్నో దశాబ్దాలుగా పార్టీ కోసం అహర్నిశలు కృషి చేస్తున్న వారి కష్టాన్ని గుర్తించకుండా వారి దగ్గర డబ్బు సంచులు లేవనే నెపంతో ఇప్పుడు వారిని పక్కనపెట్టేసి కోట్లకు పడగలెత్తిన ప్రవాస భారతీయులను, పారిశ్రామికవేత్తలను తీసుకొచ్చి టిక్కెట్లు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. దీంతో చంద్రబాబు నాయకులు ఎవరైనా సరే అవసరానికి వాడుకొని కరివేపాకులా పక్కనపడేస్తారన్న చర్చ ఆ పార్టీ వర్గాల్లోనే జోరుగా సాగుతోంది. బీసీ జపం చేసే చంద్రబాబు ఆచరణలోకి వచ్చేసరికి గెలుపుగుర్రాల పేరుతో ధనబలం ఉన్న వారివైపే మొగ్గ చూపిస్తున్నారని జిల్లాలో బలమైన సామాజిక వర్గాలకు చెందిన ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.

వీరి నాయకత్వానికి తిలోదకాలు!

ప్రస్తుతం ఉమ్మడి విజయనగరం జిల్లాలోని ఎస్.కోట, నెల్లిమర్ల, పార్వతీపురం నియోజకవర్గాల్లో టీడీపీ పేరు చెబితే ఠక్కున గుర్తొచ్చే నాయకులు కోళ్ల అప్పలనాయుడి కోడలు కోళ్ల లలితకుమారి, పతివాడ నారాయణస్వామినాయుడు, బొబ్బిలి చిరంజీవులు. ఈ ముగ్గురు నాయకులు టీడీపీలో సుదీర్ఘ కాలంగా సేవలు అందిస్తున్నావారే. కానీ ప్రస్తుతం వారి ముగ్గురి పరిస్థితి త్రిశంకుస్వర్గంలా మారింది. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఆ పార్టీ టిక్కెట్ దక్కే అవకాశాలు దాదాపుగా లేవనే చర్చలు సాగుతున్నాయి. ఆ ముగ్గురు సీనియర్ నాయకులు జిల్లాలోని ప్రధాన సామాజిక వర్గాలైన కొప్పలవెలమ, తూర్పుకాపు, ఎస్సీ సామాజిక వర్గాలకు చెందినవారే కావడం గమనార్హం.

45 ఏళ్ల సీనియార్టీకి చిక్కులు

ఎస్.కోట నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి కుటుంబానికి 45 సంవత్సరాల రాజకీయ చరిత్ర ఉంది. ఆమె మామ కోళ్ల అప్పలనాయులు ఏడుసార్లు ఎమ్మెల్యేగా పనిచేశారు. అందులో ఆరు సార్లు టీడీపీ నుంచే కావడం గమనార్హం. ఒకసారి మాత్రమే స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందారు. ఆయన రాజకీయ వారసత్వంతో రాజకీయాల్లోకి వచ్చిన కోడలు లలిత కుమారి రెండుసార్లు టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా పనిచేశారు. గత ఐదేళ్లూ ప్రతిపక్షంలో సైతం టీడీపీ అండగా ఉన్నారు. అయితే, ఆమె దగ్గర ఎన్నికల్లో ఖర్చు పెట్టడానికి రూ.కోట్లలో డబ్బులు లేవని, ఉన్నా ఖర్చు చేయరనే ఒకేఒక్క సందేహంతో చంద్రబాబు రాబోయే ఎన్నికల్లో ఆమెను పక్కనపెట్టేస్తున్నారనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. ఇటీవలే రాజకీయ తెరంగేట్రం చేసిన ప్రవాస భారతీయుడు గొంప కృష్ణకు చంద్రబాబు ప్రాధాన్యం ఇవ్వడం అందుకు ఊతమిస్తోంది. వేపాడ మండలానికి చెందిన ఆయనకు రాజకీయ నేపథ్యం లేకున్నా డబ్బులు బాగానే ఉన్నాయని ఆ పార్టీ నాయకులే చెబుతున్నారు. పార్టీలో తనకు జరిగిన అవమానంపై లలితకుమారి కొన్నాళ్లుగా అగ్గి మీద గుగ్గిలం మాదిరిగా రగిలిపోయినా చంద్రబాబు ఏమి మంత్రం వేశారో కానీ తర్వాత చల్లబడిపోయారు.

పతివాడకు తీవ్ర పరాభవం...

నెల్లిమర్ల నియోజకవర్గంలో టీడీపీ వింత ఆచారానికి తెరతీసింది. నలభై సంవత్సరాలుగా టీడీపీలో ఎనలేని సేవలు అందిస్తూ ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలిపొందిన పతివాడ నారాయణ స్వామినాయుడిది ఒక రికార్డు. ప్రోటెం స్పీకర్‌గా, చక్కెర, వాణిజ్యశాఖా మంత్రిగా కూడా పనిచేశారు. కానీ ఇప్పుడు ఆ పార్టీ అధిష్టానం ఆయనను, ఆయన వారసులను కనీసం పట్టించుకోవడం లేదు. వారిని పక్కనబెట్టి తూర్పు కాపు సామాజిక వర్గానికి చెందిన కర్రోతు బంగార్రాజును ఏడాది కిందట టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా చంద్రబాబు నియమించారు. కానీ ఇప్పుడు టీడీపీ-జనసేన పొత్తులో భాగంగా నెల్లిమర్ల టీడీపీ టిక్కెట్ బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన లోకం మాధవికి కేటాయించడానికి తెరవెనుక ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీంతో బంగార్రాజు వర్గం కంగుతింది. విజయనగరానికి చెందిన ఆమె, ఆమె భర్త మిరాకిల్ ఇంజినీరింగ్ కాలేజీ, మిరాకిల్ సాఫ్ట్‌వేర్ కంపెనీలకు అధిపతులు. కోట్లాది రూపాయల సంపద ఉన్న వారి ముందు పతివాడ 40 ఏళ్ల అనుభవం, కర్రోతు బంగార్రాజు సామాజిక బలం చంద్రబాబుకు కనిపించకుండాపోయాయనే చర్చ సాగుతోంది. ఎక్కువ కాలం విదేశాల్లోనే ఉన్న మాధవి జనసేన పార్టీ తరపున నెల్లిమర్ల టిక్కెట్ తనకే వస్తుందన్న ధీమాలో ఉన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మరోవైపు గంటా శ్రీనివాసరావు పేరు కూడా తెరపైకి వచ్చింది. ఐదేళ్లకోసారి నియోజకవర్గం మార్చేసే ఆయన ఈసారి నెల్లిమర్ల నుంచి టీడీపీ టిక్కెట్‌తో బరిలోకి దిగుతారనే వాదనలు వినిపిస్తున్నాయి. ధన బలం ఉన్న లోకం మాధవి, గంటా శ్రీనివాసరావుల పేరు తప్ప పతివాడ కుటుంబం పేరు ఎక్కడా టీడీపీ-జనసేనలో వినిపించలేదు. కనిపించట్లేదు!

లోకేశ్‌తో డీల్... చిరంజీవులుకు ఎసరు!

పార్వతీపురం మన్యం జిల్లాలో పార్వతీపురం అసెంబ్లీ నియోజకవర్గం టీడీపీ టిక్కెట్ బోనెల విజయచంద్రకేనని చంద్రబాబు విస్పష్టంగా చెప్పేశారు. ప్రవాస భారతీయుడైన ఆయనకు ఏమాత్రం రాజకీయ అనుభవం లేకపోయినా కేవలం ధనబలం ఉందన్న కారణంతోనే టిక్కెట్ ఇస్తున్నారనే విమర్శలు ఆ పార్టీలోనే వస్తున్నాయి. నేరుగా నారా లోకేశ్‌తో డీల్ కుదుర్చుకొని వచ్చి ఇంతవరకు ఆ పార్టీ బాధ్యతలు చూసుకున్న మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు టిక్కెట్‌కు ఎసరు పెట్టారనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

చరిత్ర పుటల్లోకి అంబేడ్కర్ విగ్రహం



- డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమశాఖ మంత్రి రాజన్నదొర

సాలూరు: చరిత్ర పుటల్లో నమోదయ్యేలా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం భారత రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిందని ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. సాలూరు పట్టణంలోని తన స్వగృహంలో విలేకరులతో బుధవారం మాట్లాడారు. విజయవాడలో 19 ఎకరాల్లో అంబేడ్కర్ స్మృతివనం, 206 అడుగుల ఎత్తైన విగ్రహం ప్రపంచ ప్రజలను ఆకర్షిస్తోందన్నారు. అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగం వల్లనే సామాజిక న్యాయం సాధ్యమైందని పేర్కొన్నారు. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, నేడు ఉపముఖ్యమంత్రిగా, గిరిజన సంక్షేమశాఖ మంత్రిగా పనిచేస్తున్నానంటే రాజ్యాంగం కల్పించిన అవకాశంగా పేర్కొన్నారు. అంబేడ్కర్‌కు నీరాజనంగా నియోజకవర్గంలోని ఆయన విగ్రహాలకు సొంతనిధులతో రంగులు వేయిస్తున్నట్టు వెల్లడించారు. విజయవాడలో నిర్మించిన ఎత్తైన అంబేడ్కర్ విగ్రహావిష్కరణ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి, ప్రముఖుల చేతుల మీదుగా ఈ నెల 19న జరగనుందని, ఆ రోజు నియోజకవర్గంలోని నాయకులు, ప్రజలందరూ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించాలని కోరారు.

అంగన్‌వాడీలంతా కుటుంబ సభ్యులే..

అంగన్‌వాడీ ఉద్యోగులందరూ మా కుటుంబసభ్యులని, వారి సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అన్నారు. ఇప్పటికే జీతాలు మినహా అన్ని డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలత తెలిపిందన్నారు. జూన్, జూలై నెలల నుంచి జీతాలు పెంచుతామని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపిన విష యాలను ఆయన గుర్తుచేశారు. అంగన్‌వాడీ ఉద్యోగులు సమ్మెను విరమించి విధులకు హాజరుకావాలని కోరారు. కొన్ని రాజకీయ పార్టీల స్వార్థ రాజకీయాలకు బలికావద్దన్నారు. గత టీడీపీ పాలనతో చంద్రబాబు ప్రభుత్వం అంగన్‌వాడీలపై లాఠీచార్జీలు, బాష్పవాయు ప్రయోగాలు, గుర్రాలతో తొక్కించిన ఘటనలను గుర్తుచేశారు. అంగన్‌వాడీలకు మంచిచేయాలన్న ఆలోచనతో జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నారని, సమ్మెను విరమించి తిరిగి విధుల్లో చేరాలని కోరారు.

ప్రజారోగ్యానికి భరోసా

- ప్రైవేటు ఆస్పత్రుల్లో ముమ్మర తనిఖీలు
- నోటిఫైడ్ వ్యాధుల వివరాలు హెచ్‌ఎంఐఎస్‌లో నమోదు తప్పనిసరి
- డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించుకోని ఆస్పత్రులపై చర్యలు
- ఆరోగ్యశ్రీ రోగుల నుంచి డబ్బులు వసూలు చేస్తే కేసుల నమోదు
- ఇప్పటి వరకు జిల్లాలో 10 కేసుల నమోదు
- సేవల్లో తేడావస్తే రిజిస్ట్రేషన్లు రద్దు



పార్వతీపురంలో ఓ ప్రైవేటు ల్యాబ్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

పార్వతీపురంటౌన్: జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యమిస్తోంది. వైద్యసేవలు పారదర్శకంగా అందజేయాలని, ప్రతి సేవకు జవాబుదారీగా ఉండాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు సూచిస్తోంది. ఇందులో భాగంగా ఆస్పత్రుల తనిఖీలను తప్పనిసరి చేసింది. ప్రతి నెలా ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల తనిఖీలకు ప్రత్యేక బృందాలను నియమించింది. నోటిఫైడ్ వ్యాధుల వివరాలు, సేవల తీరును విధిగా నమోదు చేయాలని ఆదేశాలు జారీచేసింది. వైద్య సేవలు అందజేయడంలో నిర్లక్ష్యం వహించినా, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడినా, ఆస్పత్రి సేవల వివరాలు సరిగా నమోదు చేయకపోయినా ఆస్పత్రుల లైసెన్సు రద్దు చేయాలని జిల్లా ఉన్నతాధికారులకు కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ సూచించారు. దీంతో పార్వతీపురం మన్యం జిల్లాలో ఆస్పత్రుల తనిఖీలను వైద్యారోగ్యశాఖ అధికారులు ముమ్మరం చేశారు. ప్రైవేటు నర్సింగ్ హోమ్‌లు, ఆస్పత్రులు, క్లినిక్‌ల సేవలపై నిఘా పెంచారు. ఈ నెలలో జిల్లాలోని 28 ప్రైవేటు ఆస్పత్రులు, క్లినిక్‌లను తనిఖీచేసి పదింటిపై కేసులు నమోదు చేశారు.

ప్రతినెలా జిల్లాలో ఆరు ప్రైవేటు ఆస్పత్రుల తనిఖీ

డీఎంహెచ్ ప్రతి నెలా జిల్లాలో ఆరు ప్రైవేటు ఆస్పత్రులను తనిఖీ చేయాలి. తనిఖీ చేసిన ఆస్పత్రుల నివేదికను కుటుంబ సంక్షేమశాఖ పోర్టల్‌కు అనుసంధానించాలి. డీఎంహెచ్‌ఓతో పాటు మరో బృందం కూడా ఉంటుంది. ఈ బృందాలు తరచూ తనిఖీలు నిర్వహించి ఎప్పటికప్పుడు నివేదికలు ఇవ్వాలి. ప్రైవేటు వ్యక్తుల నుంచి నర్సింగ్ హోమ్ మీద వచ్చిన ఫిర్యాదులకు తక్షణమే స్పందించి పరిష్కరించాలి. డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించుకోని ఆస్పత్రులపై చర్యలు తీసుకోనున్నారు.

నిర్ధారణ అయితేనే డెంగీగా పరిగణించాలి

డెంగీ వ్యాధి అనేది నోటిఫైడ్ డిసీజ్. ఈ వ్యాధి సోకినప్పుడు ప్రైవేటు ఆస్పత్రులు తప్పకుండా ప్రభుత్వానికి సమాచారం ఇవ్వాలి. అలా చేయకుండా ఏ జ్వరమైనా డెంగీగా చిత్రీకరించడం, ప్లేట్‌లెట్లు తగ్గాయని వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారు. వాస్తవానికి వైరల్ ఫీవర్‌కు కూడా ప్లేట్లెట్లు తగ్గడం సహజం. ప్రైవేటు ఆస్పత్రుల్లో దీనిపై దోపిడీ జరుగుతున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయి. ఇకపై ఇలా చేసిన ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకోనున్నారు. డెంగీ నిర్ధారణ రక్తపరీక్షల ద్వారానేకాదు, జీజీహెచ్ ఎలీసా టెస్టులో నిర్ధారణ అయితేనే డెంగీగా పరిగణించాలి. ప్లేట్‌లెట్లు తగ్గగానే డెంగీగా చిత్రీకరిస్తున్నారు. దీనిపై తనిఖీ బృందం ప్రత్యేక దర్యాప్తు నిర్వహిస్తుంది.

జిల్లాలో ప్రైవేటు ఆస్పత్రుల వివరాలు

క్లినిక్‌లు	38
డెంటల్ క్లినిక్‌లు	15
పాలి క్లినిక్‌లు	03
బేసిక్ ల్యాబ్‌లు	17
హై అండ్ ల్యాబ్	01
0-20 పడకల ఆస్పత్రులు	24
21-50 పడకల ఆస్పత్రులు	02
51-100 పడకల ఆస్పత్రులు	02

రిజిస్ట్రేషన్ రద్దు చేస్తాం



ప్రాణాంతక మలేరియా, డెంగీ, టీబీ, మ్యూకోమైకోసిస్, హ్యూమన్ రేబిస్, టైఫాయిడ్ వివరాలు ఇంటిగ్రేటెడ్ హెల్త్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్, అబార్షన్, డెలివరీలు, ఆపరేషన్ వివరాలను హెల్త్ మెడికల్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్లో నమోదు విషయమై ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌ను తనిఖీ చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. వివరాల నమోదులో నిర్లక్ష్యం చేస్తే షోకాజ్ నోటీసులు జారీ చేసి క్లినికల్ ఎస్టాబ్లిష్ మెంట్ చట్టం ప్రకారం ఆస్పత్రుల రిజిస్ట్రేషన్‌ను రద్దు చేస్తాం.

– డా.బి.జగన్నాథరావు, జిల్లా వైద్యాఆరోగ్య శాఖాధికారి, పార్వతీపురం మన్యం

ప్రైవేటు ఆస్పత్రులపై వస్తున్న ఫిర్యాదులివే..

- నోటిఫైడ్ డిసీజ్ వివరాలు అంటే డెంగీ మొదలుకొని టీబీ వరకు బాధితుల వివరాలను పోర్టల్లో నమోదు చేయడం లేదు.
- ఇష్టారాజ్యంగా లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తుండడం
- జనన ధ్రువీకరణ వివరాలు పోర్టల్‌లో నమోదు చేయకపోవడం
- సరైన కారణాలు లేకుండానే అబార్షన్లు నిర్వహించడం
- డెంగీ చికిత్సకు భారీగా డబ్బులు వసూలు చేయడం
- ఆరోగ్యశ్రీ సేవలకు రోగుల నుంచి డబ్బు వసూలు చేయడం
- కాన్పు సమయంలో తల్లుల మృతి పట్ల సరైన కారణాలు చూపకపోవడం

గొప్ప పర్యాటక కేంద్రంగా అంబేడ్కర్ స్మృతివనం

- ఈనెల 19న ప్రారంభోత్సవానికి అంతా తరలిరావాలి
- రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్‌ప్రసాద్ పిలుపు



మీడియాతో మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ ఎం.విక్టర్ ప్రసాద్

విజయనగరం అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం విజయవాడ స్వరాజ్ మైదానంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న భారతరత్న డా.బి.ఆర్.అంబేడ్కర్ స్మృతివనం, విగ్రహావిష్కరణకు జిల్లా ప్రజానీకం పెద్దఎత్తున తరలిరావాలని రాష్ట్ర షెడ్యూల్డు కులాల కమిషన్ మారుమూడి విక్టర్‌ప్రసాద్ పిలుపునిచ్చారు. జిల్లాల పర్యటనలో భాగంగా బుధవారం నగరానికి వచ్చిన ఆయన జిల్లాపరిషత్ అతిథి గృహంలో మీడియాతో మాట్లాడారు. దేశంలోనే కనీవినీ ఎరుగని రీతిలో అన్ని రకాల వసతులతో విజయవాడ నడిబొడ్డున సుమారు 20 ఎకరాల విస్తీర్ణంలో అత్యంత విలువైన ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న డా.అంబేడ్కర్ స్మృతివనం గొప్ప పర్యాటక కేంద్రంగా రూపొందబోతోందని పేర్కొన్నారు. ఈ స్మృతివనంలో మూడువేల మంది కూర్చొనేందుకు వీలుగా మల్టీపర్పస్ కన్వెన్షన్ హాల్, రెండు వేల మంది కూర్చొనేందుకు వీలుగా ఓపెన్ ఎయిర్ థియేటర్, 10 వేల పుస్తకాలతో భారీ గ్రంథాలయం వంటివి ఏర్పాటు కానున్నట్టు తెలిపారు. దేశంలోని 140 కోట్ల ప్రజలకు సమాన హక్కులు కల్పించి స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం తన రాజ్యాంగం ద్వారా అందించిన మహానీయుడని చెప్పారు. రాష్ట్ర ప్రజలంతా పెద్ద ఎత్తున పాల్గొనడంతో పాటు తమ మిత్రులు, తెలిసిన వారంతా లక్షలాదిగా కార్యక్రమంలో పాల్గొనేలా సోషల్ మీడియా, మొబైల్ ఫోన్‌ల ద్వారా ఈ సందేశాన్ని చేరవేయాలని కోరారు. డా.అంబేడ్కర్ విగ్రహం సమానత్వానికి, స్వేచ్ఛకు, విజ్ఞానానికి చిహ్నమని పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి రామానందం, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సుధారాణి, డీఎస్పీ గోవిందరావు, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యుడు బొంగ భానుమూర్తి, నగర కార్పొరేటర్ దాసరి సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన కలెక్టర్, ఎస్పీ

జిల్లా పర్యటన నిమిత్తం బుధవారం నగరానికి చేరుకున్న రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్‌ను కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎస్పీ దీపిక పాటిల్ జెడ్పీ అతిథి గృహంలో కలిశారు. జిల్లాలో ఎస్సీల హక్కుల పరిరక్షణ, వారి సంక్షేమానికి సంబంధించి జిల్లా యంత్రాంగం తీసుకుంటున్న చర్యలను చైర్మన్‌కు వివరించారు. ఈ సందర్భంగా పలువురు దళిత సంఘాల ప్రతినిధులు ఎస్సీ కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రాలు అందజేశారు.

క్లుప్తంగా

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేత



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

బొండపల్లి: ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన ఆర్థిక సహాయం చెక్కును బాధితులకు ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య బుధవారం అందజేశారు. మండల కేంద్రం బొండపల్లి గ్రామానికి చెందిన నమ్మి జ్యోతి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా ఈవిషయాన్ని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బీవీ ప్రభూజీ రాజు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఆయన స్పందించి సీఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేశారు. ఈ మేరకు సహాయ నిధి నుంచి రూ.80 వేల చెక్కు మంజూరు కాగా దానిని జ్యోతి భర్త సంతోష్‌కు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

చెంచుల కాలనీలో అగ్నిప్రమాదం



అగ్నికి ఆహుతవుతున్న చెంచుల కాలనీ

విజయనగరం క్రైమ్: స్థానిక అయ్యన్నపేట శివారు ప్రాంతంలో ఉన్న చెంచుల కాలనీలో మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం సంభవించి ఉంటుందని అగ్నిమాపక శాఖ అధికారులు పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో ఎనిమిది ఇళ్లు దగ్ధమయ్యాయని, సుమారు రూ.9 లక్షల 60వేల వరకూ ఆస్తినష్టం జరిగి ఉంటుందని స్పష్టం చేశారు. ప్రమాద విషయం తెలియగానే హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను రెండు గంటల పాటు శ్రమించి అదుపులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. అయితే అదృష్టవశాత్తు ఎవరికీ ఎటువంటి ప్రమాదం సంభవించలేదన్నారు

టీడీపీ నాయకుడి దాష్టీకం

- చంద్రబాబు సభకు రాలేదని గిరిజనుడిపై దాడి



మాట్లాడుతున్న బాధితుడు రామయ్య

సాలూరు: ఇటీవల బొబ్బిలిలో జరిగిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు బహిరంగ సభకు పిలిచినా రాలేదన్న ఆగ్రహంతో టీడీపీ నాయకుడు విచక్షణా రహితంగా కొట్టి దాడిచేశాడని ఓ గిరిజన బాధితుడు వాపోతూ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు సాలూరు మండలంలోని సారిక గ్రామానికి చెందిన బాధితుడు పూసూరు రామయ్య ఫిర్యాదులో పేర్కొన్న వివరాలిలా ఉన్నాయి. ఇటీవల బొబ్బిలిలో జరిగిన బహిరంగసభకు రావాలని గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు డి.రామకృష్ణ తనను పిలిచినా, వెళ్లకపోవడంతో సభకు రాలేదన్న కారణంతో ఈ నెల 14న రాత్రి 7 గంటల సమయంలో తన ఇంటికి రామకృష్ణ వచ్చి తిట్టడంతోపాటు విచక్షణా రహితంగా కొట్టాడని, అంతేకాకుండా కర్రతీసుకుని మరోసారి కొట్టడా నికి రాగా స్థానికులు అడ్డుకున్నారని ఫిర్యాదులో తెలిపాడు. తనను తిట్టి, కొట్టి చంపుతానని బెదిరించడంతో పాటు, తన ఇంటిని ధ్వంసం చేస్తానని, ఊరునుంచి తగిలేస్తానని భయపెట్టాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీనిపై కేసు నమోదుచేసి, తనకు ప్రాణరక్షణ కల్పించి రామకృష్ణ నుంచి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

9 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

సాలూరు: పట్టణంలోని మహంతివీధిలో బహిరంగ ప్రదేశంలో పేకాట ఆడుతున్న 9 మంది పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు పట్టణ ఎస్సై సురేష్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ, ముందస్తు సమాచారం మేరకు మహంతివీధి రామాలయం దగ్గరలో బహిరంగ ప్రదేశంలో పేకాట శిబిరాన్ని గుర్తించామన్నారు. అక్కడ పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.1,79,510 స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి,దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹115	₹200	₹210

సామాజిక సాధికారతకు... అంబేడ్కర్ విగ్రహమే సాక్ష్యం

- రేపే విజయవాడలో మహావిష్కరణ
- పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు



పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

'డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 206 అడుగుల భారీ విగ్రహం... విజయవాడ నడిబొడ్డున ఈ నెల 19న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించనున్నారు. ఎక్కడో ఊరి చివరన, ఎస్సీ కాలనీల్లో అంబేడ్కర్ విగ్రహం ఉండటాన్నే దశాబ్దాలుగా చూస్తున్నాం. అంబేడ్కర్ ఏ ఒక్క వర్గానికో, ఏ ఒక్క కులానికో కాదు ఆయనో దేశ సంపద. ఆయన స్ఫూర్తితో తన నాలుగున్నరేళ్ల పాలనలో బడుగు, బలహీన, అణగారిన వర్గాలకు తాను అందించిన భరోసాను, సాధించిన సామాజిక సాధికారతను ప్రజానీకానికి తెలియజెప్పడానికి ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.

ఎన్నేళ్లగానో అణచివేతకు గురవుతున్న తాడిత, పీడిత, అణగారిన వర్గాలకు అది భరోసా ఇచ్చేదిలా ఉంది' అని పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు అభిప్రాయపడ్డారు. విజయవాడలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మెమోరియల్ పార్కులో అంబేడ్కర్ స్మృతివనాన్ని, అంబేడ్కర్ భారీ కాంస్య విగ్రహాన్ని 19వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆవిష్కరించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా 'సాక్షి'కి ప్రత్యేకంగా ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...



రాజ్యాంగ స్ఫూర్తి సాకారం...

భారత రాజ్యాంగంలో ఆర్టికల్స్ ప్రకారం ఒక పనికి సమాన వేతనం ఇవ్వాలి. లింగ వివక్ష ఉండకూడదు. మహిళలకు సమాన ప్రాతినిధ్యం కల్పించాలి. వాటిని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఆచరణలో చూపించారు. మహిళలకు స్థానిక సంస్థలు, నామినేటెడ్ పోస్టుల్లో 50 శాతం రిజర్వేషను కచ్చితంగా అమలుచేశారు.

వారి మనోభావాలకు ప్రతీకగా...

'రాష్ట్ర జనాభాలో 72 శాతం బీసీ సామాజిక వర్గాలు, కోటి మంది ఎస్సీలు, 26 లక్షల మంది ఎస్టీలు ఉన్నారు. వారి మనోభావాలకు ప్రతీకగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భారీ కాంస్య విగ్రహాన్ని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేయించారు. భారతీదేశ చరిత్రలో మరే రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా ఇలాంటి సంకల్పం తీసుకోలేదు. 19.40 ఎకరాల విస్తీర్ణంలో 81 అడుగుల ఎత్తైన ప్లాట్‌పారంతో కలిపి 206 అడుగుల ఎత్తైన విగ్రహ రూపకల్పనకు సుమారు 112 మెట్రిక్ టన్నుల కంచు, 352 మెట్రిక్ టన్నుల ఉక్కును ఉపయోగించారు. దాదాపు రూ.404 కోట్ల వ్యయమైంది. 2వేల మంది కూర్చొనే సామర్థ్యంతో ఆడిటోరియం కూడా నిర్మించారు.

స్ఫూర్తిని నింపే విగ్రహం...

అంబేడ్కర్ విగ్రహానికి ఆ మార్గంలో వెళ్తున్న ఓ ఐఏఎస్ అధికారి తన కారును ఆపి నమస్కారం చేసుకొని వెళ్లడం చూశాను. ఒక జడ్జి కూడా దణ్ణం పెట్టుకొని వెళ్లడం కనిపించింది. బడుగు బలహీన వర్గాలకే కాదు ఉన్నత స్థానాల్లో ఉన్నవారికీ అదొక స్ఫూర్తిని నింపే విగ్రహం. అదేదో ఉత్సవ విగ్రహంగా ఏర్పాటు చేశారనుకుంటే పొరపాటు. మన కోసమే జీవిస్తే మనలోనే ఉండిపోతాం. ప్రజల కోసం పనిచేస్తే ప్రజల గుండెల్లో ఉంటాం అనే అంబేడ్కర్ ఆలోచనా విధానాన్ని పూర్తిగా తీసుకున్నామని చెప్పడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటుచేయించిన స్ఫూర్తి ప్రదాత ఈ విగ్రహం. ఆయన ముఖ్యమంత్రి గాకముందు ప్రతిపక్ష నాయకుడిగా ప్రజాసంకల్ప పాదయాత్ర చేసినప్పుడు 'ప్రతి ఇంట్లో నాన్న గారి ఫోటో పక్కన నా ఫోటో ఉండాలనేదే నా ఆశయం' అని తరచుగా చెప్పడానికి అంబేడ్కరే ఆయనకు స్ఫూర్తి.

అదొక నాలెడ్జ్ హబ్...

అంబేడ్కర్ విగ్రహం అదొక నాలెడ్జ్ హబ్. అత్యున్నత స్థాయికి ఎదగడానికి విద్య ఒక్కటే మార్గమని చెప్పడానికే ముఖ్యమంత్రి ఆ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు. విద్యను ఎవరైనా నిర్లక్ష్యం చేసినవారెవ్వరైనా సరే ఒక్కసారి ఆ విగ్రహాన్ని చూస్తే చాలు. నాలెడ్జ్ పవర్ తెలుస్తుంది. అంబేడ్కర్ స్ఫూర్తితోనే రాష్ట్ర విద్యారంగంలో సంస్కరణలు తీసుకొచ్చారని చెప్పవచ్చు. పేదరికమైనా మరే కారణమైనా సరే ఏ ఒక్క విద్యార్థీ విద్యకు దూరంకాకూడదనే పలు పథకాలు తీసుకొచ్చారు. ఐక్యరాజ్య సమితి (యూఎన్‌ఓ) నిర్దేశించిన 27 సమగ్ర అభివృద్ధి సూచికల్లో విద్య, వైద్యం తదితర 17 అంశాలు మన రాష్ట్రంలో పూర్తి స్థాయిలో అమలవుతున్నాయి.

అభివృద్ధి అంటే అర్థమయ్యేలా...

ఒక దేశమో, ఒక రాష్ట్రమో అభివృద్ధి చెందిందంటే మనం చూడాల్సింది రంగుల గోడలు కాదు, అద్దాల మేడలు కాదు. దేశ ప్రజల వ్యక్తిగత అభివృద్ధే నిజమైన అభివృద్ధి అన్న అంబేడ్కర్ మాటల కార్యరూపమే నేడు ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేసిన హ్యూమన్ క్యాపిటల్. మానవాభివృద్ధే దేశాభివృద్ధి. అందుకే ఈ రాష్ట్రంలో ఐదు కోట్ల మంది ప్రజల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ కేవలం తమ అర్హత ఒక్కటే ప్రామాణికంగా ఎలాంటి వివక్ష లేకుండా నేరుగా డీబీటీ ద్వారా రూ.2.37 లక్షల కోట్ల ఆర్థిక సాయం అందించడానికి అంబేడ్కరే స్ఫూర్తి.

అంబేడ్కర్ ఆశయాలు సాకారం...

వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో అంబేడ్కర్ ఆశయాలను, ఆలోచనా విధానాన్ని పూర్తిస్థాయిలో అమలుచేశారని గర్వంగా చెప్పవచ్చు. అంబేడ్కర్ భారీ కాంస్య విగ్రహాన్ని ఈనెల 19వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రతి సచివాలయం నుంచి ఏడుగురిని తీసుకెళ్తున్నాం. ఎస్సీ, ఎస్టీ, బీసీల్లో ప్రముఖులను రాజకీయాలకు అతీతంగా ఆరోజు సన్మానం కూడా చేస్తున్నాం.

పోలమాంబ ఆలయానికి భక్తుల తాకిడి

- అమ్మవారి ఘటాలను మోసిన భక్తులు



అమ్మవారికి అలంకరించిన వెండి ఆభరణాలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, గిరిజనుల మద్దుబిడ్డ, భక్తులు కొంగుబంగారంగా కొలిచే కల్పవల్లి శంబర పోలమాంబ అమ్మవారి ఆలయానికి భక్తుల తాకిడి పెరుగుతోంది. ఈనెల 22,23,24తేదీల్లో శంబర జాతర జరగనుంది. సుదూర ప్రాంతాలలో ఉన్న ప్రజలు సంక్రాంతి పండగకువారివారి గ్రామాలకు వచ్చిన విషయం తెలిసిందే. ఆయా ప్రాంతాలకు తిరిగి వెళ్లే ముందు అమ్మవారిని దర్శించుకోవడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో బుధవారం వందలాది మంది భక్తులు శంబర గ్రామానికి చేరుకుని, అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి ఘటాలకు పసుపు, కుంకుమ, పూలతో ప్రత్యేకపూజలు చేశారు. అలాగే వనంగుడిలో ఉన్న పెద్ద అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం వెనకున్న పురాతన వేపచెట్టుకు మహిళలు పూజలు చేశారు.

గ్రామంలో ఘటాలు, పాల ధార తిరువీధి



తిరువీధిలో ఘటాలు పట్టుకున్న భక్తులు

గ్రామంలోని అన్ని పురవీధుల్లో అమ్మవారి ఘటాలు, పాలధార తిరువీధి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. భక్తులు ఎదురెళ్లి అమ్మవారి ఘటాలు, పాలధార పట్టుకున్న మహిళకు కాళ్లు కడిగి, ఘటాలు, పాలధారలో బియ్యం వేసి పూజలు చేశారు. పసుపు, కుంకమలతో కలిగిన ముద్రాటను భక్తులకు ఆమె అందించారు. అమ్మవారి ఘటాలు, పాలధారను భక్తులు తలపై మోసి, మొక్కులు తీర్చుకున్నారు.

వెండి వక్షస్థలం కానుక

శంబర పోలమాంబ అమ్మవారికి తయారు చేయించిన వెండి వక్షస్థలాన్ని దేవాదాయశాఖకు దాతలు బుధవారం సమర్పించారు. విశాఖజిల్లా పెందుర్తికి చెందిన సాయికిరణ్, రమ్యకీర్తి దంపతులు అమ్మవారికి 1600 గ్రాముల వెండి ఆభరణాలను అందించారు. సుమారు రూ.1.60లక్షల విలువ చేసే వెండి ఆభరణాలను మంగళ వాయిద్యాలతో ఊరేగించి, అమ్మవారు కొలువైన చదురుగుడికి తీసుకువచ్చి, వేదమంత్రాలతో పూజలు నిర్వహించి, ఈవో సూర్యనారాయణ, మాజీ ట్రస్ట్ బోర్డు చైర్మన్ల సమక్షంలో అమ్మవారికి అలంకరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



రామస్వామి మృతదేహం

రాజాం సిటీ: మండల పరిధి గురవాం గ్రామ సమీపంలో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో సంతకవిటి మండలం పుల్లిట గ్రామానికి చెందిన పిన్నింటి రామస్వామి (42) మృతిచెందాడు. స్థానికులు, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు రేగిడి మండలంలోని ఓ ఫ్యాక్టరీలో రామస్వామి విధులు నిర్వహిస్తున్నాడు. ఎప్పటిలాగే డ్యూటీకి వెళ్తుండగా ఎదురుగా వచ్చిన ఆటో ఢీకొనడంతో తీవ్రగాయాలపాలయ్యాడు. వెంటనే స్థానికుల సహాయంతో ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు, గ్రామస్తులు మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళన వ్యక్తం చేశారు. మృతునికి భార్య సుందరమ్మ, ముగ్గురు కుమార్తెలు పల్లవి, శ్రీలత, వందనశ్రీ ఉన్నారు. ఈ ఘటనపై కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి..



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

విజయనగరం క్రైమ్: స్థానిక పాతబస్టాండ్ ఎదురుగా గల షాపు మెట్ల మీద గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్లు వన్‌టౌన్ పోలీసులు బుధవారం తెలిపారు. మృతుడు సుమారు 45 నుంచి 50 మధ్య వయసు కలిగి ఉన్నాడని, సమీపంలో విచారణ చేయగా ఎటువంటి వివరాలు తెలియకపోవడంతో మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించామని పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు వన్‌టౌన్ పోలీసులను సంప్రదించాలని సీఐ బి.వెంకటరావు కోరారు.

లారీ కింద పడి మహిళ..

కొత్తవలస: విశాఖ–అరకు (516) జాతీయ రహదారిపై కొత్తవలస మండలంలోని తాడివానిపాలెం జంక్షన్ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరోగ్యశాఖలో పనిచేస్తు న్న ఎం.ఇందిరబాయ్(52) అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ప్రమాదానికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రంలోని పీఎంఎల్ కాంప్లెక్స్ వెనుకవైపు నివాసముంటున్న ఎం.ఇందిరాబాయ్ విశాఖపట్నంలో గల గో్రప్రభుత్వ విక్టోరియా హాస్పిటల్‌లో హెల్త్ సూపర్‌వైజర్‌గా పని చేస్తోంది. ఆమె తన స్కూటీపై విశాఖపట్నం వెళ్లి తిరిగి వస్తుండగా తాడివానిపాలెం జంక్షన్ వద్దకు వచ్చేసరికి ముందు వెళ్తున్న కారు ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో కారును ఢీకొట్టి రోడ్డుపై పడిపోయింది. అదే సమయంలో వెనుక నుంచి వచ్చిన లారీ చక్రాల కిందికి వెళ్లిపోవడంతో నలిగిపోయి అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో సుమారు నాలుగు కిలోమీటర్ల మేర రెండువైపులా ట్రాఫిక్ స్తంభించిపోయింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

19న జిల్లాలో జన్ భాగీధారీ



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ గోవిందరావు

పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లాలో జన్ భాగీధార్ కార్యక్రమం ఈనెల 19న నిర్వహించనున్నామని, దీనిని విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు కోరారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లో ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 19న విజయవాడలో 125 అడుగుల ఎత్తు గల అంబేడ్కర్ విగ్రహావిష్కరణ జరుగుతుందని, అందులో భాగంగా జన్‌భాగీధార్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 19న ఉదయం 7 గంటలకు సెయింట్ పీటర్స్ పాఠశాలనుంచి కలెక్టరేట్ వరకు మారథాన్, మానవహారం జరుగుతుందని చెప్పారు. అలాగే రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రక్తదాన శిబిరంలో యువత అధికంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఉదయం 11 గంటలకు ఐటీడీఏ గిరిమిత్ర సమావేశ మందిరంలో అంబేడ్కర్ జీవిత చరిత్రపై ఛాయాచిత్రప్రదర్శన, సిగ్నేచర్ క్యాంపెయిన్, సమావేశం జరుగుతుందన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, డీఈఓ ఎన్.ప్రేమ్‌కుమార్, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఎస్.వెంకటేశ్వరరావు, సమాచార పౌరసంబంధాల అధికారి ఎల్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ క్రీడామైదానంలో నేడు మారథాన్

- కలెక్టర్ నాగలక్ష్మి



ఎస్.నాగలక్ష్మి, కలెక్టర్

విజయనగరం అర్బన్: సామాజిక సమతా సంకల్పయాత్ర మహోత్సవాల్లో భాగంగా ఈ నెల 18న స్థానిక రాజీవ్ క్రీడామైదానంలో మారథాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమం గంటస్తంభం కూడలి మీదుగా కోట జంక్షన్, సింహాచలం మేడ కూడలి, బాలాజీ జంక్షన్ మీదుగా తిరిగి రాజీవ్ క్రీడామైదానం వరకు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో యువత, వాకర్స్ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

స్కిల్ స్కాంలో తీర్పు చెంపపెట్టు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు తదితరులు

- బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిపై నమోదైన స్కిల్‌స్కాం కేసులో కోర్టు తీర్పు ఆయన అవినీతిని సమర్థించిన వారందరికీ పెద్ద చెంప పెట్టు అని బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన తన క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ కొన్ని నెలలుగా చంద్రబాబు అరెస్టు అక్రమమని, రాజకీయ కక్షతోనే అరెస్టు చేశారని, ఇది అన్యాయమని టీడీపీ అండ్ కో, ఎల్లోమీడియా గగ్గోలు పెట్టాయన్నారు. కానీ నిర్దోషి అని మాత్రం చంద్రబాబుతో పాటు ఇతరులు కూడా చెప్పకపోవడం విశేషమన్నారు. 17 ఎ వర్తించదని అన్నారే తప్ప తప్పు చేయలేదని చెప్పకపోవడం గమనార్హమన్నారు. అసలు అది వర్తిస్తుందా? వర్తించదా? అన్నది పక్కన పెడితే దోషి కాదని, ప్రభుత్వం ఇన్వాల్వ్‌మెంట్ ఉందని కానీ తీర్పులో లేదన్నారు. ఈ తీర్పులో అధికార పక్షం ఎలా వ్యవహరించిందో అందరికీ తెలిసిందేనని చెప్పారు. ఎప్పటి నుంచో సీఎం జగన్ మోహన్ రెడ్డి చట్టం తన పని చేసుకువెళ్తుందని చెబుతున్నారని, తీర్పు ఈ విధంగా వచ్చినప్పుడు గతంలో గగ్గోలు పెట్టిన దత్తపుత్రుడు, పలు కమ్యూనిస్టు పార్టీలు, ఎల్లో మీడియా వర్గాలు ఇప్పుడు కిక్కురుమనకపోవడం గమనించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వానికి మచ్చలేకుండా వచ్చిన ఈ తీర్పు పెట్టని కోట అన్నారు. అవినీతిని సమర్థించే అన్ని పక్షాలకూ ఒక చెంప పెట్టు అయిన ఈ తీర్పును ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్ నాయుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఇంటి గోపాల రావు, శంబంగి వేణుగోపాల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టు వద్ద నిరంతర నిఘా



బైపాస్ రోడ్డులో వాహనాల రిజిస్ట్రేషన్ రికార్డు తనిఖీ చేస్తున్న డీఎస్పీ శ్రీధర్

రామభద్రపురం: త్వరలో సార్వత్రిక ఎన్నికలు ఉన్నందున పోలీస్ చెక్ పోస్టుల వద్ద నిరంతర నిఘా, పటిష్ట భద్రత చర్యలు తీసుకుంటున్నట్లు డీఎస్పీ శ్రీధర్ తెలిపారు. మండల కేంద్రంలోని బైపాస్ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టును బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అటుగా వచ్చే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఒడిశా, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్ తదితర రాష్ట్రాలకు సరిహద్దు అయినందున ఈ మార్గంలో అధిక మొత్తంలో నగదు, మాదక ద్రవ్యాలు తరలించే అవకాశం ఉందని, అందుకే ఇక్కడ చెక్‌పోస్టు ఏర్పాటు చేసి ఒక ఎస్‌ఐ స్థాయి పోలీస్ అధికారి పర్యవేక్షణలో నిరంతర నిఘా పెట్టినట్లు చెప్పారు. అక్రమ రవాణా నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎస్పీ దీపికాపాటిల్ ఆదేశాలు మేరకు మద్యం, మత్తు పదార్థాల అక్రమ రవాణా జరగకుండా పోలీసు సిబ్బందితో ముమ్మరంగా వాహన తనిఖీలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ సత్యనారాయణ పాల్గొన్నారు.